క్లుప్తంగా

శ్రీవారి సేవలో కలెక్టర్ లక్ష్మీషా



ఆలయం ఎదుట తిరుపతి జిల్లా కలెక్టర్ లక్ష్మీషా

తిరుమల: తిరుపతి జిల్లా కలెక్టర్‌గా వచ్చిన లక్ష్మీషా బుధవారం ప్రాతఃకాల సమయంలో కుటుంబ సమేతంగా శ్రీవారిని సుప్రభాత సేవలో దర్శించుకున్నారు. ఆయనకు ఆలయాధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి, లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

టీటీడీ కళాశాలల ప్రిన్సిపాళ్ల బదిలీ





ఎస్పీడబ్ల్యూ ప్రిన్సిపల్ నారాయణమ్మ, ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ వేణుగోపాల్‌రెడ్డి



ఎస్‌జీఎస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ

తిరుపతి సిటీ: టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లను బదిలీ చేస్తూ టీటీడీ ఈఓ ధర్మారెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న టీ నారాయణమ్మను పద్మావతీ డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపల్‌గా బదిలీ చేశారు. ఆ కళాశాల ప్రిన్సిపల్ మహదేవమ్మ బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. అలాగే ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న ఎస్ వేణుగోపాల్‌రెడ్డిని ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్‌గా బదిలీ చేశారు. ఎస్వీ ఆర్ట్స్ కళాశాల కెమిస్ట్రీ విభాగాధిపతి బీ సత్యనారాయణను ఎస్‌జీఎస్ కళాశాల ప్రిన్సిపల్‌గా నియమించారు. బదిలీ అయిన మూడు కళాశాలల ప్రిన్సిపాళ్లు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా టీటీడీ డీఈఓ భాస్కరెడ్డి, అధ్యాపకులు ప్రిన్సిపాళ్లకు అభినందనలు తెలిపారు.

మేలు చేశారని నమ్మితేనే ఓట్లు వేయండి

- 99 శాతం హామీలు నెరవేర్చిన ఏకైక నాయకుడు జగనన్న
- చంద్రబాబు కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోవద్దు
- ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలో పేదలందరికి మేలు చేశారని నమ్మితేనే జగనన్నకు ఓట్లు వేసి గెలిపించండని టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అభ్యర్థించారు. తిరుపతి 3, 6, 42, 45వ డివిజన్లలో బుధవారం 'ఏపీకి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన తొలుత సంక్షేమ పథకాల బోర్డులను ఆవిష్కరించి, అక్కడ ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం స్థానికులు మాట్లాడుతూ జగనన్న లాంటి నాయకుడు అధికారంలో ఉంటే తమ లాంటి పేదలంతా ఎంతో సుభిక్షంగా జీవిస్తారని చెప్పారు. అందుకే ఎప్పుడు ఎన్నికలు వచ్చినా తామంతా జగనన్నకే మద్దతుగా ఉంటామని చెప్పారు. ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి మాట్లాడుతూ దేశ రాజకీయ చరిత్రలోనే ఇంతవరకు ఏ నాయకుడికి సాధ్యం కానన్ని సంక్షేమ పథకాలను అందించిన గొప్ప నాయకుడు జగనన్న అన్నారు. ఎలాగైనా అధికారంలోకి రావాలన్న దురుద్దేశంతో ఎన్నికల సమయంలో వందల హామీలను గుప్పించి, అధికారంలోకి వచ్చాక ఆ హామీలను తుంగలో తొక్కేసే చంద్రబాబు లాంటి నాయకుడిని గతంలో చూశామని తెలిపారు. ఇప్పుడు మళ్లీ రాజకీయ అవగాహనే లేని పవన్‌కళ్యాన్‌తో పొత్తు పెట్టుకుని పేద ప్రజలను మరోసారి మోసగించేందుకు వస్తున్నాడని, చంద్రబాబు చెప్పే కల్లబొల్లి మాటలను నమ్మవద్దని హెచ్చరించారు.

చరిత్రలో నిలిచిపోయేలా తిరుపతి అభివృద్ధి

తిరుపతి నియోజకవర్గంలో రూ.1700 కోట్లతో తిరుపతిని హైదరాబాద్ తరహాలో అభివృద్ధి చేయగలిగామంటే జగనన్న సాకారం వల్లేనని ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి తెలిపారు. తిరుపతిలో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న 26 వేల మంది పేదల సొంతింటి కల నెరవేర్చిన ఘనత జగనన్నదేనన్నారు. అలాగే తిరుపతిలో 18 మాస్టర్‌ప్లాన్ రోడ్లు, ఫ్రీలెఫ్ట్ రోడ్లను తీసుకొచ్చి తిరుపతిని సుందరంగా తీర్చిదిద్దామన్నారు. గత 20ఏళ్లుగా సాధ్యం కాని టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాల మంజూరు సీఎం జగనన్న సహకారంతోనే సాధ్యమైందన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల జీతాల పెంపు, అతిథి అధ్యాపకులు సర్వీసు రెగ్యులరైజేషన్ చేయడంతో పాటు రెండు రోజు క్రితం టీటీడీ బోర్డు సమావేశంలో వేలమందికి రూ.వేలల్లో జీతాలు పెంచి, వారి జీవితాల్లో వెలుగులు నింపామన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, టౌన్ బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్‌కే బాబు, క్లస్టర్ ఇన్‌చార్జిలు సురేంద్రరెడ్డి, ఆదం సుధాకర్‌రెడ్డి, దొడ్డారెడ్డి మురళీరెడ్డి, కార్పొరేటర్లు తమ్ముడు గణేష్, అనీష్‌రాయల్, శేఖర్‌రెడ్డి, వెంకటరెడ్డి, పార్టీ నాయకులు వెంకటేష్ రాయల్, నల్లాని బాబు, నాధమునిరెడ్డి, రామచంద్రారెడ్డి, తాతారెడ్డి, బాలాజీ, హరి పాల్గొన్నారు.



సభకు హాజరైన జనం

ప్రిన్సిపల్ మహదేవమ్మకు సన్మానం



మహదేవమ్మను సన్మానిస్తున్న అధ్యాపకులు, ఎస్వీయూ అధికారులు

తిరుపతి సిటీ: స్థానిక పద్మావతీ డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపల్ మహదేవమ్మ బుధవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్వీయూ రిజిస్ట్రార్ మహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ ఎస్వీ డబ్ల్యూ కళాశాలలోనే విద్యాభ్యాసం చేసి అక్కడే అధ్యాపకురాలిగా, హెడ్‌గా, ప్రిన్సిపల్‌గా పనిచేయడం అదృష్టమన్నారు. 5 ఏళ్ల పాటు సుదీర్ఘంగా ప్రిన్సిపల్ హోదాలో పనిచేసిన ఆమె కళాశాల అభివృద్ధికి అహర్నిశలు పని చేశారని కొనియాడారు. ఆమె చేసిన కృషితోనే కళాశాలకు న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్, అటానమస్ హోదా వచ్చిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ అప్పారావు, టీటీడీ డిగ్రీ కళాశాలల చీఫ్ అడ్వైజర్ ఎల్ఆర్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

విజయసింహారెడ్డి సేవలు అభినందనీయం



విజయసింహారెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఉద్యోగులు

తిరుపతి అర్బన్: సమాచార శాఖ డీపీఆర్వోగా విజయసింహారెడ్డి అందించిన సేవలు మరువలేనివని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి బాలకొండయ్య కొనియాడారు. తిరుపతి డీపీఆర్ఓగా పనిచేస్తున్న విజయసింహారెడ్డి బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోని సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం ఏనిర్వహించారు. కార్యక్రమంలో డీపీఆర్వోలు వెంకటరమణ, పురుషోత్తం, డివిజనల్ పీఆర్ఓలు పాల్గొన్నారు.

మేమంతా జగన్ వెంటే..

నారాయణవనం: రాబోవు ఎన్నికల్లో సంక్షేమ సారథి జగనన్న వెనుక నడవడానికి మేమందరం సిద్ధంగా ఉన్నామని వైఎస్సార్ సీపీ మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. బుధవారం నారాయణవనంలో ఎంపీ మద్దెల గురుమూర్తి పార్టీ శ్రేణులతో కలిసి సిద్ధం పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల సంక్షేమానికి సీఎం జగనన్న పెద్దపీట వేశారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రతకు నిఘా

తిరుపతి (అలిపిరి): ప్రయాణికుల భద్రతకు రైల్వే రక్షణ దళం (ఆర్‌పీఎఫ్) నిరంతరం నిఘా ఉంచాలని, తిరుపతి రైల్వేస్టేషన్‌లో ప్రధానంగా చోరీలు, రైల్వే ఆస్తులకు సంబంధించి నేరాలు, కిడ్నాపర్లపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సౌత్ సెంట్రల్ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ కమ్ ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమా ఠాకూర్ సూచించారు. బుధవారం ఆమె తిరుపతి రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న పునర్నిర్మాణ పనులు, ఆర్పీఫ్ కార్యాలయాన్ని పరిశీలించారు.

మంత్రి పెద్దిరెడ్డిని విమర్శిస్తే తగిన బుద్ధి చెబుతాం



మాట్లాడుతున్న ఎంపీఎస్ మణి, పార్టీ నేతలు

తిరుపతి మంగళం: తల్లిపాలు తాగి తల్లి రొమ్ము గుద్దినట్లు సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వ్యవహరిస్తున్న తీరు అలా ఉందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎంపీఎస్ మణి అన్నారు. తిరుపతి ఎంఆర్‌పల్లిలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. రాజకీయ ఉనికి కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న కోనేటి ఆదిమూలానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అండతో, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో 2019 ఎన్నికల్లో గెలిచిన నీకు కృతజ్ఞత లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. రాష్ట్రంతో పాటు చిత్తూరు జిల్లాకే పెద్దాయనగా పేరున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై విమర్శలు చేసే స్థాయి నీకుందా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు దుద్దేల బాబు, బొమ్మగుంట రవి, వై.నారాయణరెడ్డి, కృష్ణమూర్తి, ఎస్.జమున, ఎం.గోపాల్ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు పంపిణీ



స్కాలర్ షిప్‌లు పంపిణీ చేస్తున్న మేయర్ డాక్టర్ శిరీష, షోరూం హెడ్ రెజీష్

తిరుపతి కల్చరల్: సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంలో 107 మంది పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేయర్ డాక్టర్ శిరీష హాజరై పేద విద్యార్థులకు రూ.8 వేలు, రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.9,72,000 చెక్‌లను అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ శిరీష, మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూం హెడ్ రెజీష్ మాట్లాడుతూ వ్యాపారంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలతో మలబార్ గ్రూప్ యాజమాన్యం పేదలకు తమవంతు చేయూతనిస్తూ ఆదరించడం అభినందనీయమన్నారు. సంస్థ ఆర్జించిన లాభాలలో మలబార్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 5 శాతం సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. విద్యార్థులు, టీచర్లు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

12 నుంచి అతిరుద్ర, శ్రీమహాలక్ష్మీయాగం

తిరుపతి కల్చరల్: దివ్యాంజన్ సాయ సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 12 నుంచి 16వ తేదీ వరకు తుమ్మలగుంట మైదానంలో అతిరుద్ర, శ్రీమహాలక్ష్మీయాగం నిర్వహించనున్నట్లు సాయివిజయ్ శర్మ తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోకకల్యాణార్థం అతిరుద్రం మహాలక్ష్మీయాగం చేపడుతున్నట్లు తెలిపారు. యాగంలో భాగంగా రోజూ ఉదయం 7 నుంచి 10 గంటల వరకు గణపతి పూజ, గణపతి హవనం, రుద్రాభిషేకం, రుద్రహవనం, 10.30 నుంచి విష్ణుసహస్రనామ పారాయణం, మహాలక్ష్మి సహస్ర కుంకుమార్చన తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. యాగంలో పాల్గొనదలచిన వారు రూ.699, రూ.799 టికెట్లను తీసుకోవాలని కోరారు. ఈనెల 2వ తేదీ నుంచి టికెట్లు ఇస్తామని తెలిపారు. టికెట్లు కొనుగోలు చేసిన భక్తులు యాగానికి వచ్చే సమయంలో రెండు రాగి, ఇత్తడి ప్లేట్లు తీసుకురావాలని, శివలింగం, శ్రీచక్రం తదితర పూజా సామగ్రి ఉచితంగా అందజేస్తామన్నారు. వివరాలకు 9490309105ను సంప్రదించాలని ఆయన కోరారు.

భాకరాపేట ఘాట్‌లో కారు బోల్తా

భాకరాపేట: తిరుపతి-మదనపల్లె జాతీయ రహదారిలోని భాకరాపేట ఘాట్ రోడ్డులో కారు బోల్తా పడింది. బుధవారం అన్నమయ్య జిల్లా కేవీపల్లె మండలం నూతనకాలువ గ్రామానికి చెందిన రెడ్డెప్పరెడ్డి, రమణమ్మ తిరుపతి నుంచి స్వగ్రామానికి బయలు దేరారు. మార్గం మధ్యలోని భాకరాపేట ఘాట్ రోడ్డులో కారు అదుపు తప్పి లోయలో పడింది. ఈ ఘటనలో ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, క్షతగాత్రులను 108లో తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

అందుబాటులోకి అధునాతన సీహెచ్‌సీ



నూతన ఆసుపత్రి భవనాన్ని ప్రారంభిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

భాకరాపేట : చంద్రగిరి నియోజక వర్గంలో అత్యంత అధునాతన సదుపాయాలతో కూడిన సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని చిన్నగొట్టిగల్లు మండల ప్రజల సౌకర్యార్థం అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తుడా చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి బుధవారం ప్రత్యేక పూజలు చేసి, అధునాతన సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని (ఆస్పత్రి) ప్రారంభించారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చారని కొనియాడారు. రూ.7.25 కోట్లతో ఆధునిక వసతులతో చిన్నగొట్టిగల్లు చరిత్రలో నిలిచిపోయేలా ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకురావడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.25 లక్షల వరకు వైద్య సేవలు పొందేలా చొరవ తీసుకున్నారని అన్నారు. ఇకపై ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఎదురైనా తిరుపతికి వెళ్లాల్సిన పరిస్థితి లేదన్నారు. 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం మండల ప్రజలకు ఓ వరం అన్నారు. ఆసుపత్రి నిర్మాణంలో చొరవ తీసుకున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ యుగంధర్‌రెడ్డి, సీడీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాలం యుగంధర్ రెడ్డి, సీడీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు స్వరూప, వైస్ ఎంపీపీ దామోదర్‌రెడ్డి, సర్పంచ్ మనోహర్, భాస్కర్‌రెడ్డి, వైద్యాధికారి శ్రీధర్, శీలాబాను పాల్గొన్నారు.

అట్టహాసంగా 'ఆడుదాం ఆంధ్రా' ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా క్రీడాధికారి సయ్యద్‌సాహెబ్, వై.ప్రవీణ్

తిరుపతి కల్చరల్: గ్రామీణ క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం అందిస్తూ వారిని వెలుగులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి క్రీడా పోటీలు బుధవారం తారకరామ స్టేడియంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరుపతి జిల్లా క్రీడాధికారి సయ్యద్ సాహెబ్, తిరుపతి ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ వై.ప్రవీణ్, కార్యదర్శి శ్రీధర్ హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లు విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లాకు చెందిన ఇద్దరు అంతర్జాతీయ క్రీడాకారులు ఎస్.సుజన్, వి.కార్తీకను ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో శాప్ మాలిని, గోపి, హిందుజా, ప్రేమ్, వినోద్, ఆది, ఫిజికల్ డైరెక్టర్లు, టీం మేనేజర్లు పాల్గొన్నారు.

దొరస్వామయ్య సేవలు ఆదర్శనీయం



దొరస్వామయ్య దంపతులను సత్కరిస్తున్న డీఈఓ, మాజీ ఎమ్మెల్సీ

తిరుపతి ఎడ్యుకేషన్: విద్యారంగం, విద్యార్థుల అభ్యున్నతికి పి.దొరస్వామయ్య చేసిన సేవలు ఆదర్శనీయమని తిరుపతి డీఈఓ డాక్టర్ వి.శేఖర్ కొనియాడారు. తిరుపతి సింగాలగుంట నగరపాలక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు దొరస్వామయ్య పదవీ విరమణ కార్యక్రమం పాఠశాల ఆవరణలో బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఈ సభకు ముఖ్య అతిథిగా డీఈఓ హాజరై మాట్లాడారు. అనంతరం దొరస్వామయ్య దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కత్తినరసింహారెడ్డి, కార్పొరేటర్ పి.నరేంద్రనాథ్, ఎంఈఓలుపాల్గొన్నారు.

అలహాబాద్ వ్యక్తి తిరుపతిలో హత్య

తిరుపతి క్రైం: శ్రీవారి దర్శనార్థం తిరుపతికి వచ్చిన ఓ డ్రైవర్ హత్యకు గురయ్యాడు. తిరుచానూరు రోడ్డులోని పాత ప్రైవేట్ బస్టాండ్ వద్ద రక్తపు మడుగులో ఉన్న మృతదేహాన్ని గుర్తించిన కొందరు ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుపతి ఈస్ట్ సీఐ మహేశ్వర్‌రెడ్డి ఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు దర్యాప్తు చేపట్టారు. 55 మంది శ్రీవారి భక్తులతో చత్తీస్‌గఢ్ కోర్బా నుంచి తిరుపతికి వచ్చారని నిర్ధారించారు. మృతుడు అలహాబాద్‌కు చెందిన చంద్రసేన్ తివారీ(52)గా గుర్తించారు. క్లీనర్ నిరంజన్ డ్రైవర్ చంద్రసేన్ తలపై బలమైన రాడ్లతో హత్య చేసి ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. హత్య జరగడానికి పాత కక్షలు ఏమైనా ఉన్నాయా? లేక ఆర్థిక లావాదేవిలు ఏమైనా ఉన్నాయనే కోణంలో విచారిస్తున్నట్లు సీఐ మహేశ్వర్‌రెడ్డి వెల్లడించారు.

భారీగా తహసీల్దార్ల బదిలీలు

- ఉద్యోగ విరమణ, మూడేళ్లు పూర్తి కాని వారికి మినహాయింపు
- జిల్లాకు కేటాయించిన తహసీల్దార్లకు తదుపరి పోస్టింగ్‌లు
- ఉత్తర్వులు జారీచేసిన సీసీఎల్‌ఏ అడిషనల్ సెక్రటరీ ఇంతియాజ్

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా తహసీల్దార్లను బదిలీ చేశారు. ఈ మేరకు బుధవారం సీసీఎల్‌ఏ అడిషనల్ సెక్రటరీ ఇంతియాజ్ ఉత్తర్వులు జారీచేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రాతిపదికన తహసీల్దార్ల బదిలీలను నిర్వహించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి 67 మంది బదిలీ కాగా, చిత్తూరు జిల్లాకు ఇతర జిల్లాల నుంచి 67 మందిని నియమించారు. ఎన్నికల నిబంధనల మేరకు ఒకే మండలంలో మూడేళ్ల లోపు ఉన్న 5 మందిని, 30-6-2024 నాటికి ఉద్యోగ విరమణ కానున్న 11 మందికి బదిలీల నుంచి మినహాయింపు కల్పించారు. జిల్లాకు కేటాయించిన తహసీల్దార్లకు చిత్తూరు కలెక్టర్ తదుపరి పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు.

తిరుపతిజిల్లా నుంచి బదిలీ అయిన తహసీల్దార్లు

కుప్పయ్య కలెక్టరేట్ ప్రొటోకాల్ విభాగం నుంచి వైఎస్సార్ కడప జిల్లా, భారతి కలెక్టరేట్ నుంచి వైఎస్సార్ కడప, ఝాన్సీలక్ష్మి శ్రీకాళహస్తి ఆర్డీఓ ఆఫీస్ ఏఓగా పనిచేస్తూ కర్నూలుకు, హనుమంత నాయక్ బాలయ్యపల్లె నుంచి అనంతపురం, కృష్ణ నాయుడుపేట నుంచి వైఎస్సార్ కడప జిల్లాకు, భార్గవి బీఎన్ కండ్రిగ నుంచి నంద్యాలకు, జరీనా సత్యవేడు నుంచి అన్నమయ్య జిల్లా, నిత్యానంద బాబు తొట్టంబేడు నుంచి అనంతపురం, ఉదయ్ సంతోష్ రేణిగుంట నుంచి కర్నూలు, శివప్రసాద్ ఏర్పేడు నుంచి వైఎస్సార్ కడప, శ్రీదేవి కేవీబీ పురం నుంచి అనంతపురం, మధుసూదన్‌రావ్ పిచ్చాటూరు నుంచి వైఎస్సార్ కడప, ప్రమీల నారాయణవనం నుంచి వైఎస్సార్ కడప, వెంకటరమణ తిరుపతి అర్బన్ నుంచి వైఎస్సార్ కడప, సుబ్రహ్మణ్యం తిరుపతి రూరల్ నుంచి అనంతపురం, శిరీష చంద్రగిరి నుంచి వైఎస్సార్ కడప, భాగ్యలక్ష్మి పాకాల నుంచి వైఎస్సార్ కడప, వెంకటేశ్వర్లు ఆర్‌సీ పురం నుంచి నంద్యాల, ఐ.సుబ్రహ్మణ్యం వడమాలపేట నుంచి వైఎస్సార్ కడప, పరమేశ్వరస్వామి పుత్తూరు నుంచి అనంతపురం, దస్తగిరయ్య ఎర్రావారిపాళ్యం నుంచి అనంతపురం, లోకేశ్వరి చిన్నగొట్టిగల్లు నుంచి అనంతపురం, రమేష్‌బాబు ఎండోమెంట్స్ నుంచి వైఎస్సార్ కడప, వెంకటలక్ష్మణ ఎండోమెంట్స్ నుంచి వైఎస్సార్ కడపలను బదిలీ చేశారు.

కృష్ణభట్‌కు పలువురు నివాళి



కృష్ణభట్‌కు నివాళులు అర్పిస్తున్న తిరుపతి అర్బన్ బ్రాహ్మణ సేవాసంఘం ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: ప్రముఖ వ్యాపారవేత్త, బ్రాహ్మణ సమాజం సలహాదారుడైన కృష్ణభట్ మృతికి బుధవారం పలువురు ఘన నివాళులు అర్పించి తమ సంతాపాన్ని ప్రకటించారు. కృష్ణభట్ చెన్నై అపోలో ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. ఈమేరకు తిరుపతిలోని వారి నివాసం వద్ద బ్రాహ్మణ సమాజం నేతలు, బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు కృష్ణభట్ పార్థివ దేహానికి నివాళులు అర్పించారు.

సివిల్‌జడ్జి రోహిత్‌కు సన్మానం

తిరుపతి సిటీ: స్థానిక డాక్టర్ అంబేడ్కర్ గ్లోబల్ న్యాయ కళాశాల విద్యార్థి ఎం.రోహిత్ ఇటీవల జరిగిన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన సందర్భంగా కళాశాల యాజమాన్యం ఆయనను బుధవారం ఘనంగా సత్కరించింది.



క్లుప్తంగా

టీటీడీ చైర్మన్ భూమనతో జిల్లా కలెక్టర్ లక్ష్మీషా



దుశ్శాలువతో ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డిని సత్కరిస్తున్న జిల్లా కలెక్టర్ లక్ష్మీషా

తిరుపతి మంగళం: తిరుపతి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన లక్ష్మీషా బుధవారం పద్మావతిపురంలోని ఎమ్మెల్యే నివాసంలో టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. దాంతో జిల్లా కలెక్టర్ లక్ష్మీషాకు ఎమ్మెల్యే దుశ్శాలువ కప్పి పుష్పగుచ్ఛంతో సత్కరించి అభినందించారు.

కేబినెట్ నిర్ణయం హర్షణీయం



మురళీరెడ్డి

తిరుపతి సిటీ: యూనివర్సిటీల్లో, ఉన్నత విద్యాసంస్థల్లో పనిచేస్తున్న నాన్‌టీచింగ్ సిబ్బంది పదవీ విరమణ వయస్సు 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ బుధవారం రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని వైఎస్సార్ యూనివర్సిటీస్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కే.మురళి రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన వర్సిటీలో మీడియాతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఉద్యోగుల పక్షపాతి అని మరో మారు నిరూపించుకున్నారని తెలిపారు.

రామ్మోహన్ కుటుంబానికి న్యాయం చేయండి



రామ్మోహన్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ శ్రీకాంత్‌రెడ్డి

తిరుపతి సిటీ: శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో టైం స్కేల్ ఉద్యోగిగా పని చేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన కే.రామ్మోహన్ కుటుంబానికి న్యాయం చేయాలని ఎస్వీయూ టైంస్కేల్ ఉద్యోగుల సంఘం వీసీకి విన్నవించింది. మానవతా దృక్పథంతో మృతుడి కుటుంబానికి రూ.5 లక్షలు ఆర్థికసాయం, కుటుంబంలో ఒకరికి టైం స్కేల్ ఉద్యోగం ఇవ్వాలని వీసీని కోరారు. స్పందించిన ఆయన చంద్రగిరిలోని మృతుడి నివాసానికి వెళ్లి భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి న్యాయం చేస్తామని వీసీ శ్రీకాంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

చెక్ బౌన్స్ కేసులో నిందితుడికి జైలు

తిరుపతి లీగల్: చెక్ బౌన్స్ కేసులో తిరుపతి కేశవాయిని గుంట సత్యసాయి నగర్‌కు చెందిన ఎస్.వరదారెడ్డికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ తిరుపతి మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి బుధవారం తీర్పు చెప్పారు. ఫిర్యాది తరపు న్యాయవాది సుమన్ తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి ఎస్వీ నగర్‌కుకు చెందిన లీలా ప్రసాద్ వద్ద వరదారెడ్డి 2017 అక్టోబర్ మూడో తేదీ రూ.50 వేలు అప్పుగా తీసుకున్నాడు. ఆ సొమ్ము చెల్లించే క్రమంలో 2017 అక్టోబర్ 30వ తేదీన ఓ చెక్కును ఆయన లీలాప్రసాద్‌కు ఇచ్చాడు. అతను ఆ చెక్కును బ్యాంకులో వేయగా బౌన్స్ అయింది. దీంతో లీలాప్రసాద్ కోర్టులో వరదారెడ్డిపై చెక్ బౌన్స్ కేసు దాఖలు చేశాడు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి వరదారెడ్డికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. అలాగే నష్టపరిహారం కింద రూ.లక్షను ఫిర్యాదుదారు లీలాప్రసాద్‌కు నిందితుడు వరదారెడ్డి చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

కొనసాగుతున్న గజ దాడులు



గజదాడుల్లో ధ్వంసమైన పంట

చంద్రగిరి: మండలంలోని శేషాచల అటవీ శివారు ప్రాంతాల్లో పది రోజులుగా ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా మంగళవారం అర్ధరాత్రి మామిడిమానుగడ్డ, భీమవరం సమీపంలోని పంట పొలాల్లో వీరవిహారం చేశాయి. వరి, అరటి పంటలు, మామిడి చెట్లు, డ్రిప్ ఇరిగేషన్ పైపులు, పంపుసెట్లను ధ్వంసం చేశాయి. గజదాడులపై పనబాకం రేంజ్ డీఆర్వో చినబాబు మాట్లాడుతూ పది రోజులుగా ఏనుగులు పంటలపై దాడులు చేస్తుండడంతో వాటి కదలికలు గుర్తించడానికి డ్రోన్లతో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశామన్నారు. సుమారు 14 ఏనుగుల గుంపు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. గ్రామాలపై దాడులు చేయకుండా ప్రత్యేకంగా మూడు బృందాలతో రాత్రి వేళల్లో పహారాకు ఆదేశించినట్లు తెలిపారు. చిన్నరామాపురం గ్రామం వైపు ఏనుగులు వస్తున్నాయని తెలిసి, బాణసంచా పేల్చి, డప్పులు వాయిస్తూ వాటిని దారి మళ్లించామని చెప్పారు.

వైఎస్సార్ ఆసరా.. మహిళలకు భరోసా

- ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా సీఎం జగన్
- ఎర్రావారిపాళెంలో నాలుగో విడతగా రూ.4.21 కోట్లు
- చిన్నగొట్టిగల్లులో రూ.5.54 కోట్లు ఆసరా నిధులు పంపిణీ
- పండుగ వాతావరణంలో ఆసరా పంపిణీ వేడుకలు



చిన్నగొట్టిగల్లు: వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ చేస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



ఎర్రావారిపాళెం సభకు హాజరైన మహిళలకు అభివాదం చేస్తున్న మోహిత్‌రెడ్డి



చిన్నగొట్టిగల్లు సభలో పాల్గొన్న మహిళలు

భాకరాపేట: వైఎస్సార్ ఆసరా పథకం మహిళా సాధికారతకు దోహదం చేస్తోందని తుడా చైర్మన్, చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. బుధవారం నాలుగో విడత వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులతో బహిరంగ సభలు చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాల్లో నిర్వహించారు. ఈ సభలకు మహిళలు విశేష సంఖ్యలో తరలిరావడంతో సభా ప్రాంగణాలు పండుగ వాతావరణం తలపించింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి స్థానిక నాయకులు, కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు ఘన స్వాగతం పలికారు. ఎర్రావారిపాళెం మండలంలో 4572 మందికి నాలుగో విడతగా రూ.4.21 కోట్లు, చిన్నగొట్టిగల్లు మండలానికి రూ.5.54 కోట్లు నిధులు విడుదలు అయ్యాయి. ఈ చెక్కులను చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయేలా సీఎం జగనన్న నవరత్న పథకాలను అమలు చేశారన్నారు. జగనన్న ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన వైఎస్సార్ ఆసరా పథకం డ్వాక్రా మహిళల కోసం అమలు చేసిన ఓ బృహత్తర పథకమని అభివర్ణించారు. ఈ పథకం కింద ప్రభుత్వం 2019 ఏప్రిల్ 11 వరకు బ్యాంకుల వద్ద పెండింగ్‌లో ఉన్న బకాయిలను ప్రభుత్వం మాఫీ చేసిందన్నారు. ప్రతి మహిళ కుటుంబ పోషణలో తనదైన శైలిలో బాధ్యతగా వ్యవహరిస్తున్నారు. నేటి సమాజంలో మహిళలు ఉన్నతశక్తిగా ఎదుగుతున్నారు. అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీలు బాలం యుగంధర్‌రెడ్డి, రెడ్డెమ్మ, సీడీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డి, జెడ్పీటీసీ స్వరూప, కరుణాకర్‌రెడ్డి, చెంగల్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, భాస్కర్‌రెడ్డి, కొండారెడ్డి, అన్వర్‌బాషా, ఎంపీడీఓలు దేవేంద్ర బాబు, అమర్‌నాథ్, ఎంపీటీసీలు, సర్పంచులు, డ్వాక్రా మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ తుడా చైర్మన్‌కి నివాళి

పాకాల: మండలంలోని కమతంపల్లిలో జరిగిన తుడా మాజీ చైర్మన్ ఎల్‌బీ ప్రభాకర్‌నాయుడు కర్మక్రియల్లో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రభాకర్ నాయుడు చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు.

యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం

- అభివృద్ధి చేశాకే ఆశీర్వదించమని అడుగుతున్నా
- డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి



మాట్లాడుతున్న భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం: తిరుపతి నియోజకవర్గంలోని యువత ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లనవసరం లేకుండా తిరుపతికి ఐటీ హబ్ తీసుకొచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్, తిరుపతి సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. తిరుపతి 3వ డివిజన్ పోస్టల్ కాలనీలోని అంబేడ్కర్ లా కాలేజీలో, తిరుపతి 8వ డివిజన్‌లో బుధవారం స్థానికులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తిరుపతి నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులు స్వాగతిస్తూ స్థానిక ప్రజలంతా ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనంత అభివృద్ధి చేసి చూపడం జరిగిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, తన తండ్రి తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి సహకారంతో సుమారు రూ.1700 కోట్లతో తిరుపతిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. తిరుపతిలో తాను చేసిన అభివృద్ధిని చూసి వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించి గెలిపించాలని స్థానిక ప్రజలను అభ్యర్థించారు. సమావేశంలో పార్టీ నగర అధ్యక్షుడు పాలగిరి ప్రతాప్‌రెడ్డి, కార్పొరేటర్ తమ్ముడు గణేష్, నాయకులు వెంకటేష్ రాయల్, మునిశేఖర్‌రాయల్ పాల్గొన్నారు.

ఆలోచించి ఓటేయండి

తిరుపతి తుడా: తిరుపతి అభివృద్ధిని తాము అందరిలా మాటల్లో కాకుండా చేతల్లో చేసి చూపించామని, అభివృద్ధిని చూసి మీరంతా ఓటేయండని నగర డిప్యూటీ మేయర్, వైఎస్సార్సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ రెడ్డి కోరారు. స్థానిక తిరుమల బైపాస్ రోడ్డు సీపీఆర్ హిల్స్ అపార్ట్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఆత్మీయ సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన భూమన అభినయ్ రెడ్డి మాట్లాడుతూ తాను తిరుపతి భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని పక్కాగా అభివృద్ధి ప్రణాళికలను రచించానన్నారు. దేశంలోనే తిరుపతి ప్రముఖ అభివృద్ధి చెందిన నగరంగా చేయాలన్న సంకల్పంతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ నారాయణ, నాయకులు మునిరామిరెడ్డి, నాగిరెడ్డి, అశోక్ రెడ్డి, యోగానంద, సీపీఆర్ హిల్స్ అపార్ట్‌మెంట్ అసోసియేషన్ నాయకులు, స్థానికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశానికి హాజరైన స్థానిక ప్రజలు

మహిళల సంక్షేమానికి పెద్దపీట



గాంధీపురంలో సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తున్న చెవిరెడ్డి లక్ష్మి

తిరుపతి రూరల్: రాష్ట్రంలో మహిళల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేసిందని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి అన్నారు. గడప గడపకు ఆత్మీయ పలకరింపు కార్యక్రమంలో భాగంగా బుధవారం తిరుపతి రూరల్ మండలం గాంధీపురం పంచాయతీలో ఆమె పాదయాత్ర చేపట్టారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ ఫలాలను, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చేపట్టిన సామాజిక సేవలతో పాటు అభివృద్ధి కార్యక్రమాల గురించి ఇంటింటికీ వెళ్లి కరపత్రాల ద్వారా వివరించారు. వచ్చే ఎన్నికల్లో చంద్రగిరిలో వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. అనునిత్యం అందుబాటులో ఉంటూ, సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజాసేవకు అంకితమైన మోహిత్‌రెడ్డిని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలకు నిలయంగా ఉన్న గాంధీపురం పంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత ఎమ్మెల్యే చెవిరెడ్డికి, తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో గాంధీపురం సర్పంచ్ లక్ష్మిశివ, ఎంపీటీసీ జయకర్, రత్నం, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రామయ్య స్ఫూర్తి

పాకాల: మండలంలోని మొగరాల జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయుడు రామయ్య పదవీ విరమణ సందర్భంగా బుధవారం పాఠశాల హెచ్‌ఎం సుమలత అధ్యక్షతన ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ బాబ్జీ, ఎంఈఓ–2 లింగయ్య మాట్లాడుతూ ఒక మారుమూల ప్రాంతంలో జన్మించిన రామయ్య గణిత ఉపాధ్యాయుడిగా ఎందరో విద్యార్థులను భావి పౌరులుగా, ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. అనంతరం రామయ్య దంపతులకు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత గొడుగుచింత గోవిందయ్య, 108 జిల్లా ఫ్లీట్ మేనేజర్ రమేష్‌బాబు, మొగరాల సర్పంచ్ మధు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుడు లెనిన్

తిరుపతి సిటీ: ప్రపంచమనే పద్మంలో పరిమళం లెనిన్ అని వీక్షణం సంపాదకులు ఎన్.వేణుగోపాల్ కొనియాడారు. అభ్యుదయ వేదిక, అఖిల భారత విద్యార్థి సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో ఎస్వీ యూనివర్సిటీ ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో బుధవారం లెనిన్ శత వర్ధంతి సదస్సును ఘనంగా నిర్వహించారు. ఈ సదస్సులో సామ్రాజ్యవాదం–లెనినిజం ప్రాసంగికత అనే అంశంపై జరిగిన చర్చావేదికకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. కార్యక్రమంలో అభ్యుదయ వేదిక జిల్లా కార్యదర్శి ఎండీ ప్రసాద్, విశాలాంధ్ర జనరల్ మేనేజర్ హరినాథ్ రెడ్డి, అభ్యుదయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి పాల్గొన్నారు.

పరిపాలన భవనంలో ఆకస్మిక తనిఖీలు



ఆకస్మిక తనిఖీలు చేస్తున్న వీసీ శ్రీకాంత్‌రెడ్డి

తిరుపతి సిటీ: శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీలోని పరీక్షలు, అకడమిక్ విభాగాలను వీసీ ఆచార్య శ్రీకాంత్ రెడ్డి బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. కొందరు ఉద్యోగులు అప్పటికీ విధుల్లోకి రాకపోవడం గుర్తించారు. హాజరు పట్టికను పరిశీలించి విధులకు రాని వారిపై గైర్హాజరు నమోదు చేశారు. అనంతరం ఫైనాన్స్, డెవలప్‌మెంట్ విభాగాలను పరిశీలించి సంబంధిత విభాగ అధికారులకు సమయపాలన పాటించాలని దిశానిర్దేశం చేశారు. నిబంధనలు పాటించని ఉద్యోగులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులకు సహకరిస్తూ, స్నేహభావంతో త్వరితగతిన పనులు చేయాలని, అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

మహిళ ఆత్మహత్య

తిరుపతి క్రైమ్: నగరంలోని జీవకోనకు చెందిన ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. అలిపిరి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మొదట జీవకోన, పార్వతి నగర్లో నివాసం ఉంటున్న యువరాణి (43)తిరుపతిలోని బధిర పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. కొంతకాలం కిందట ఆమె భర్త మృతి చెందాడు. గత కొన్నిరోజులుగా ఆర్థిక సమస్యలు అధిగమించడంతో మనస్థాపానికి గురై ఎలుకల మందు తినింది. కుటుంబసభ్యులు రుయాకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. అలిపిరి పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

పదవీ విరమణ

తిరుపతి(అలిపిరి): టీటీడీలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు బుధవారం పదవీ విరమణ పొందడంతో టీటీడీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చీర్ల కిరణ్ ఆధ్వర్యంలో వారిని సన్మానించారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు అ.హేమలత, నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు.

శంకుస్థాపన

భాకరాపేట: చిన్నగొట్టిగల్లులోని మైనారిటీల కోసం రూ.40 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ భవనానికి తుడా చైర్మన్, చంద్రగిరి సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనారిటీల సంక్షేమం కోసం మైనారిటీల సబ్‌ప్లాన్‌ను అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనం, ముస్లిం అక్క చెల్లెమ్మలకు వివాహానికి వైఎస్సార్ కానుక, హజ్ యాత్రకు వెళ్లే ముస్లింలకు ఆర్థిక సహాయం అందిస్తూ అండగా ఉంటున్నామని, 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు.

21 మంది పోలీసుల పదవీ విరమణ

తిరుపతి క్రైమ్: తిరుపతి జిల్లా పరిధిలో సుదీర్ఘ సేవలందించి పదవీ విరమణ పొందిన 21 మంది పోలీసులను జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి ఘనంగా సత్కరించారు. నగరంలోని ఒక ప్రైవేట్ కల్యాణ మండపంలో బుధవారం ఏర్పాటు చేసిన సన్మాన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా పరిధిలో సుదీర్ఘ సేవలందించి పదవీ విరమణ పొందిన వారిని ఎస్పీ అభినందించారు. నిరంతరం ప్రజల కోసం సేవలందించిన మీరు ఇకపై ఆనందంగా ఉండాలని కోరారు. పదవీ విరమణ పొందిన వారిలో కానిస్టేబుళ్లు, ఏఎస్‌ఐలు, పీసీలు, ఏఆర్పీసీలు, హెచ్‌సీలు ఉన్నారు. సమావేశంలో ఏఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

ఆలయ ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తులు

తిరుపతి కల్చరల్: దేవదాయ ధర్మదాయ శాఖ ఉప కమిషనర్ ఉత్తర్వుల మేరకు శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయ నూతన ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈఓ కె.మమత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఆలయ కార్యాలయంలో పనివేళల్లో సంప్రదించి ఇందుకు సంబంధించిన దరఖాస్తులు పొందవచ్చని పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులు 20 రోజులలోపు ఆలయ కార్యనిర్వహణాధికారికి అందజేయాలని తెలిపారు.

నిత్యావసర సరుకుల కోటా పెంపు

తిరుపతి అర్బన్: ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసర సరుకుల పంపిణీని ప్రతి నెల పెంచుతూ వస్తున్నామని సివిల్ సప్లయ్ జిల్లా అధికారి రాజారఘువీర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గతంలో 50 నుంచి 60 శాతానికి మించే కార్డుదారులకు పంపిణీ చేయడం కష్టంగా ఉండేదని, ఇప్పుడు ఎంటీయూ వాహనాల ద్వారా నేరుగా కార్డుదారుల ఇళ్ల వద్దకే వెళ్తున్న నేపథ్యంలో క్రమేణా పంపిణీ పెంచుతున్నామని వెల్లడించారు. ఈ ఏడాది జనవరిలో 87శాతం కార్డుదారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశామన్నారు. వచ్చే ఫిబ్రవరిలో 90 శాతం చేయాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి కార్డుదారుడు కనీసం ఒక్క కేజీ అయినా రాగులు తప్పనిసరిగా తీసుకోవాలని స్పష్టం చేశారు. గరిష్టంగా 3 కేజీల రాగులు తీసుకునే సౌకర్యం ఉందని వెల్లడించారు.

అగ్ని ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



కాలిపోయిన సామగ్రి

పాకాల: అగ్ని ప్రమాదంలో ముగ్గురు గాయాల పాలైన సంఘటన మండలంలోని దామలచెరువులో చోటు చేసుకుంది. పోలీసులు కథనం మేరకు.. దామలచెరువు హైస్కూల్ గేటుకు సమీపంలో జ్యోతిప్రసాద్, పార్వతి దంపతులు నివాసం ఉంటున్నారు. మంగళవారం రాత్రి ఇద్దరు భోజనం చేసిన తరువాత సమీప బంధువు మహేష్‌తో కలసి ఇంటికి గడిపెట్టి ఇంట్లో నిద్రించారు. ఒక్కసారిగా ఇంట్లో మంటలు చెలరేగాయి. ఇంటి నుంచి బయటకు రావడానికి ప్రయత్నించగా ఇంటికి గడిపెట్టి ఉండడంతో రాలేకపోయారు. మంటలు అధికం కావడంతో పెద్దగా కేకలు వేస్తూ బిగ్గరగా అరవడంతో గమనించిన చుట్టుపక్కల వారు మంటలను అదుపు చేశారు. అప్పటికే ఇంటి లోపల ఉన్న ముగ్గురు గాయపడ్డారు. అలాగే ఇంట్లోని సామగ్రి కాలిపోయాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో తిరుపతి రుయాకు తరలించారు. గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి ఇంటికి నిప్పు అంటించి ఉంటారని బాధితులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేష్‌బాబు తెలిపారు. పూర్తి వివరాలు విచారణలో తెలియాల్సి ఉంది.

నవరత్నాలతో అందరికీ సంక్షేమం



ఎడ్లబండిపై వస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

చంద్రగిరి: నవరత్నాలతో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం అందించిన ఏకైక వ్యక్తి సీఎం జగనన్నే అని చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, జెడ్పీటీసీ చిల్లకూరి యుగంధర్ రెడ్డితో కలసి మండల పరిధిలోని మిట్టపాళెం పంచాయతీ, బుచ్చినాయుడుపల్లి పంచాయతీల్లో చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ప్రతి గడపలో ఆయనకు హారతులు పట్టి స్వాగతం పలికారు. ఎంపీడీఓ బాలాజీ నాయక్, ఉప సర్పంచ్ వేణుగోపాల్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పసల నాగరాజు, వేణుగోపాల్ రెడ్డి, బోయరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, సాయి, దామరపాటి గుణశేఖర్ నాయుడు, బుజ్జిబాబు, మస్తాన్, ఏఎంసీ చైర్మన్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ మల్లం చంద్రమౌళిరెడ్డి, పాల్గొన్నారు.

అంకితభావంతో ప్రజలకు సేవ చేశాను

- మాజీ కలెక్టర్, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వెంకటరమణారెడ్డి



కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి దంపతులను సన్మానిస్తున్న జేసీ, డీఆర్వో, అధికారులు

తిరుపతి అర్బన్: తిరుపతి జిల్లా తొలి కలెక్టర్‌గా పని చేసిన కె.వెంకటరమణారెడ్డి గొప్ప మానవతావాది అని ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్, డీఆర్వో పెంచలకిషోర్ అన్నారు. తిరుపతి కలెక్టర్‌గా ఉన్న వెంకటరమణారెడ్డి హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా బదిలీ కావడంతో పాటు అక్కడ ఎండీగా పనిచేస్తున్న లక్ష్మీషా తిరుపతి కలెక్టర్‌గా వచ్చారు. ఈ సందర్భంగా బుధవారం రాత్రి తుడా కార్యాలయం సమీపంలోని కచ్చపి ఆడిటోరియంలో వెంకటరమణారెడ్డికి ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త జిల్లా తిరుపతి అభివృద్ధిలో కలెక్టర్‌గా వెంకటరమణారెడ్డి మార్క్ ఎప్పుడూ చిరస్థాయిగా ఉంటుందని కొనియాడారు. కొత్త జిల్లా అభివృద్ధితో పాటు ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ఆయన సేవలను అభినందించారు.

పేదలకు మంచి చేశాను..

ఈ సందర్భంగా హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ కె.వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో అధికారుల భాగస్వామ్యం మరువలేనిదన్నారు. తిరుపతి జిల్లాలో మొదటి కలెక్టర్‌గా తనకు అవకాశం రావడం, పేదలకు మంచి చేసే అవకాశం భగవంతుడు ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. జిల్లాను అభివృద్ధి చేశాననే ఆత్మ సంతృప్తి ఉందని చెప్పారు. లా అండ్ ఆర్డర్ విషయంలో ఎస్పీ సహకారం మరువలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకట్రావు, బర్డ్స్ హాస్పిటల్ డైరెక్టర్ రెడ్డెప్ప రెడ్డి, డీఎఫ్ఓ సతీష్‌రెడ్డి, ఆర్డీఓలు నిశాంత్‌రెడ్డి, కిరణ్‌కుమార్, చంద్రముని ఇతర అధికారులు హాజరయ్యారు.